వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 070
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
ఫిబ్రవరి 25, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## లింగగిరిలో ఎలుగుబంట్ల కలకలం

- స్థానికంగా చూసిన రైతులు
- సంఘటన స్థలాన్ని సందర్శించిన పోలీసులు, ఫారెస్ట్ అధికారులు

# ఆశలు అడియాసలేనా?

## రైతు భరోసాకు మోక్షమెన్నడు?


పెట్టుబడి సాయంపై వీడని సందిగ్ధం

క్యాబినెట్ భేటీలో ఊసేలేని వైనం

వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు

సాగు సంక్షోభంలో రైతాంగం



ప్రభుత్వమిచ్చే 'రైతు భరోసా' పెట్టుబడి సాయం వస్తుందని గంపెడాశతో ఎదురుచూసిన అన్నదాతల ఆశలు అడియాసలవుతున్నాయి. ముఖ్యంగా వరంగల్ జిల్లాలోని వేలాది మంది సన్న, చిన్నకారు రైతులు ఈ సాయంపైనే ఆధారపడి సాగు పనులు మొదలుపెట్టారు. అయితే ఇటీవల జరిగిన రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు అన్నదాతలకు పిడుగులా తగిలాయి. మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై కనీసం చర్చ కూడా జరగకపోవడం రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. రైతు భరోసాపై ఎటువంటి ప్రకటన రాకపోవడంతో సాధారణ రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు భరోసా నిబంధనల్లో మార్పులు చేస్తారని, గతంలో కంటే మెరుగైన సాయం అందుతుందని ఆశపడిన రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఒకవైపు రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పకుంటున్న పాలకులు వారి సంక్షేమాన్ని గాలికి వదిలారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో రైతు సంక్షేమం ఎక్కడుందనే ప్రశ్నలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో వినిపిస్తున్నాయి.

-వరంగల్ వాయిస్, దామెర

వివరాలు 2లో..



2లో..

## మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- కలెక్టర్ తో కలిసి ఆకస్మికంగా ఈఎస్ఐ ఆసుపత్రి తనిఖీ



2లో..

## ఇంటర్ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

☐ సిబ్బందికి దిశానిర్దేశం చేసిన స్నేహ శబరీష్



8లో..

## చెత్త తరలింపుపై సీరియస్

వాహనాలు సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్ కు చేరుకోవాలి

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

బాలసముద్రంలోని ట్రాన్స్ఫర్ స్టేషన్ లో ఆకస్మిక తనిఖీలు



## బంజారాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- సంత్ సేవాలాల్ చూపిన మార్గాన్ని అనుసరించాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



8లో..

# ఆశలు.. అడియాసలేనా?

- రైతు భరోసాకు మోక్షమెన్నడు?
- పెట్టుబడి సాయంపై వీడని సందిగ్ధం
- క్యాబినెట్ భేటీలో ఊసేలేని వైనం
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- సాగు సంక్షోభంలో రైతాంగం

**వరంగల్ వాయిస్, దామెర :** రాష్ట్ర రైతాంగం గత రెండు నెలలుగా రైతు భరోసా సాయం కోసం ఎదురు చూపులు తప్పడంలేదు. ఫిబ్రవరి 18 నుంచి వారం రోజుల పాటు ప్రభుత్వం రైతుల ఖాతాలో డబ్బులు వేస్తారని ప్రచారం జరిగినా అమలుకు నోచుకోలేదు. అయితే ఈ నెల 23వ జరిగిన మంత్రివర్గ సమావేశంలోనైనా దీనిపై స్పష్టత ఇస్తారని భావించినా ఎలాంటి చర్చ లేకుండానే సమావేశాన్ని ముగించారు. అసలు ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గైర్హాజరు కావడం రైతు భరోసాపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.



## పెట్టుబడుల కోసం పాట్లు..

వ్యవసాయ పెట్టుబడులకోసం అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వ సాయం సకాలంలో అందకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులను, వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఎరువులు, విత్తనాల ధరలు పెరగడంతో పెట్టుబడి ఖర్చు భారీగా పెరిగింది. బ్యాంకుల నుంచి రుణాలు అందక, బయట 2 నుంచి 3 రూపాయల వడ్డీకి అప్పులు తెచ్చి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు వర్షాల అనిశ్చితి, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు తోడవ్వడంతో సాగు సంక్షోభంలో కూరుకుపోతోంది.

## అనిశ్చితి వీడేది ఎప్పుడు?

'ఏటా ఈ పాటికి అకౌంట్లలో డబ్బులు పడేవి.. ఈసారి అసలు రైతు భరోసా ఇస్తారో లేదో కూడా చెప్పడం లేదు' అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల పేరుతో కాలయాపన చేయకుండా, వెంటనే పెట్టుబడి సాయాన్ని విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే, ఈ సీజన్ ముగిసేలోపు జిల్లాలో రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.



### అప్పుల ఊబిలో అన్నదాతలు : పరికెల కిషన్ రావు

తెలంగాణ ప్రభుత్వం రైతులకు ప్రకటించిన 'రైతు భరోసా' నిధులను ఏమాత్రం జాప్యం చేయకుండా తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు పరికెల కిషన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట కాలం ప్రారంభమై కీలకమైన సమయం గడుస్తున్నా, ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో వైఫల్యం చెందుతోందని కిషన్ రావు విమర్శించారు. సకాలంలో సాయం అందక రైతులు సాగు పనుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వ సాయం వస్తుందని గంపెడాశతో ఉన్న రైతులకు నిరాశే ఎదురైందని, ఫలితంగా పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులు ముఖం చాటేస్తుండటంతో, గత్యంతరం లేక సామాన్య రైతులు బయట అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆర్థిక భారంతో కుంగిపోతున్నారన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

☐ సిబ్బందికి దిశానిర్ధేశం చేసిన స్నేహ శబరీష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిలి బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని పలు తరగతి గదులలో కలియ తిరుగుతూ పరీక్ష జరుగుతున్న తీరును ఆమె పరిశీలించారు. పరీక్షకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారంటూ డీఐఈవో ఎ.గోపాల్, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సునీత, డిపార్ట్మెంటల్ అధికారి రమేష్ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్నాపత్రాలను ఓపెన్ చేసి ఇన్విజిలేటర్లకు అందజేసే గదిని కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో పరీక్షల నిర్వహణ సజావుగా ఉండేలా చర్యలు చేపట్టాలని, పరీక్షల నిర్వహణకు సంబంధించిన పలు సూచనలను కలెక్టర్ చేశారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్ కోటేష్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వడ్డేపల్లిలోని ఎస్సార్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను డీఐఈవో గోపాల్, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు.




# లింగగిరిలో ఎలుగుబంట్ల కలకలం

- స్థానికంగా చూసిన రైతులు
- సంఘటన స్థలాన్ని సందర్శించిన పోలీసులు, ఫారెస్ట్ అధికారులు

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామంలో మొక్కజొన్న చేను కాడ ఉన్న ఒక రైతుకు తల్లీ, పిల్ల ఎలుగుబంట్లు కనబడ్డడం స్థానికంగా కలకలం సృష్టించింది. భయకంపితులైన సదరు రైతు వెంటనే సర్పంచ్ కీ తెలియజేయగా ఆయన పోలీసులు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు హుటాహుటిన లింగగిరికి చేసుకున్నారు. రెస్క్యూ టీం సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే వారికి ఎలుగుబంట్ల కదలికలపై ఎలాంటి సమాచారం లభించలేదు. అయినప్పటికీ స్థానికులు అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ సరిత, ఎఫ్ బీఓ యోగేష్, చెనరావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి, డ్రైవర్ సంతోష్, రెస్క్యూ టీమ్ మెంబర్ శివ, సురేష్, స్వామి, కృష్ణ, కొమరయ్య, వీఏ.సాంబరాజు, సర్పంచు గ్రామంలోని తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ బట్టల బజార్ లోని శ్రీ బాలా నగర వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో బుధవారం ఉదయం సుప్రభాత అనంతరం అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, పూర్ణాహుతి తీర్థ అన్న ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నారాయణీయం సామూహిక పారాయణం నిర్వహించారు. శ్రీ జీయర్ స్వామి వారిచే శ్రీమద్ భగవద్గీత పోటీలలో సువర్ణ పథకం సాధించిన వారికి జీయర్ స్వామి వారిచే మంగళా శాసనంలు ఇచ్చారు. తర్వాత స్వామి వారు శేష వాహనంలో నగరంలోని వీధులలో విహరించారు. దేవతాహ్వానం అనంతరం తీర్థ ప్రసాద గోష్ఠితో నేటి ఉత్సవాలలో అశేష భక్తజనం ఆలయంలోని సేవా సమితుల సభ్యులు పాల్గొన్నారు.

# మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- కలెక్టర్ తో కలిసి ఆకస్మికంగా ఈఎస్ఐ ఆసుపత్రి తనిఖీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఈఎస్ఐ ఆసుపత్రిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, మందుల సరఫరా, వైద్య సేవల పరిస్థితిని ఎంపీ స్వయంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ జిల్లాకు త్వరలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్టైల్ పార్క్, విమానాశ్రయం వంటి మూడు ప్రధాన ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో కార్మికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ కారణంగా చికిత్స కోసం ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొంన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి సౌకర్యాలను ఇప్పటినుంచే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈఎస్ఐ ఆసుపత్రిని తనిఖీ చేసినట్లు ఎంపీ వెల్లడించారు.

## సమస్యలపై సుదీర్ఘ చర్చ..

అనంతరం ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బందితో ఎంపీ డాక్టర్ కడియం కావ్య సమావేశమై ఆసుపత్రి నిర్వహణ, సౌకర్యాల లోటుపాట్లు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వైద్యుల ఖాళీలు, మందుల కొరత, శానిటేషన్ పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి అవసరమైన నిధులు, వసతులు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేపట్టి తక్షణమే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ ఓ డాక్టర్ బి.సాంబశివరావు, ఆసుపత్రి సివిల్ సర్జన్స్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామచంద్ర, ఆర్ఎంఓ డాక్టర్ యుగేందర్ ఇతర వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆఫీసులో కాదు.. అచ్చంగా ప్రజల మధ్యే!

- చెట్ల కిందే సేవలు..
- పొలాల గట్లపైనే సమస్యల పరిష్కారం
- కల్లెడ పంచాయతీ అధికారి నర్సయ్య వినూత్న శైలి
- రైతులతో మమేకమవుతున్న వైనం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** సాధారణంగా ఏ ప్రభుత్వ అధికారిని కలవాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాలి.. కుర్చీలో సార్ ఉండాలి.. ఫైలు కదలాలి. కానీ, పర్వతగిరి మండలం కల్లెడ గ్రామపంచాయతీ అధికారి (జీపీ సెక్రటరీ) రాపోలు నర్సయ్య తీరు మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. ఆయనకు ఏసీ గదులు అక్కర్లేదు.. కుషన్ కుర్చీలు అవసరం లేదు. గ్రామమే ఆయన కార్యాలయం.. చెట్ల నీడలే ఆయన పని ప్రదేశాలు. అధికారులంటే ఆఫీసులకే పరిమితం కావాలన్న నానుడిని తుడిచేస్తూ, నేరుగా ప్రజల వద్దకే వెళ్లి సేవలు అందిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు.

### పొలం గట్లపైనే పంచాయతీ పాలన..

గ్రామ పర్యటనలో భాగంగా నర్సయ్య కేవలం రోడ్లకే పరిమితం కాకుండా, పొలాల వద్దకు వెళ్లి రైతులతో మమేకమవుతున్నారు. బోరుబావుల దగ్గర, చెట్ల కింద కూర్చొని రైతులతో ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. కార్యాలయానికి సంబంధించిన ఫైళ్లను కూడా క్షేత్రస్థాయిలోనే పరిశీలిస్తూ, రైతులకు సాగు పనుల్లో ఆటంకం కలగకుండా అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచిస్తున్నారు. "అధికారిగా కేవలం ఆఫీసులో కూర్చొని సంతకాలు పెడితే క్షేత్రస్థాయి సమస్యలు తెలియవు. వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడితేనే వారి కష్టాలు, అవసరాలు స్పష్టంగా అర్థమవుతాయి. ప్రజల మధ్య ఉండటం వల్ల మన వృత్తి నైపుణ్యం పెరగడమే కాకుండా, పనుల్లో పారదర్శకత కూడా ఉంటుందని ఆయన తెలిపారు.

### గ్రామస్తుల ప్రశంసలు..

చిన్న సమస్య వచ్చినా మండల కేంద్రాలకో, జిల్లా కేంద్రాలకో వెళ్లాల్సిన అవసరం లేకుండా, అధికారి తన వద్దకే రావడంపై కల్లెడ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "మా సెక్రటరీ మా మనిషిలా కలిసిపోతారు.. చెట్టు కింద కూర్చుని కూడా మా పని పూర్తి చేస్తారు" అని రైతులు గొప్పగా చెప్పుకుంటున్నారు. ప్రజల చెంతకు పాలనను తీసుకెళ్తున్న నర్సయ్య తీరు ఇతర ప్రభుత్వ అధికారులకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

# గిరిజన విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం

## తాడ్వాయిలో ఐటీడీఏ పీవో పర్యటన



**వరంగల్ వాయిస్, ఎస్ఎస్ తడ్వాయి :** గిరిజన ప్రాంత విద్యార్థులకు విద్యాపరంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యమని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. మంగళవారం నాడు తాడ్వాయి మండలంలోని ఆశ్రమ బాలికల జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను ప్రిన్సిపాల్, సిబ్బందితో కలిసి సమీక్షించారు. తాడ్వాయి, జగ్గన్నపేట కళాశాలల్లో విద్యార్థుల అవసరాలను గుర్తించిన పీవో, తక్షణమే స్పందించి పరీక్షా ప్యాడ్‌లు, స్టేషనరీ కిట్లు, ట్రావెలింగ్ అలవెన్స్‌లను అందజేశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు డీహైడ్రేషన్ లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు గురికాకుండా పర్యవేక్షించాలని సెంటర్ ఇంఛార్జిలు, ఏఎన్ఎంలను ఆదేశించారు. అలాగే, కళాశాలలో కోతుల బెడదను నివారించడానికి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, మరమ్మత్తు పనులకు ఆదేశాలు జారీ చేశారు.

# బాధితులకు నాగుర్ల పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** రోడ్డు ప్రమాదంలో గాయపడి, అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర రైతు విమోచన సమితి మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు బుధవారం పరామర్శించారు. హనుమకొండలోని ఎస్ఎస్ఆర్ హాస్పిటల్‌ను సందర్శించిన ఆయన, బాధితులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు రేవూరి జనార్దన్ రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న నాగూర్ల వెంకటేశ్వర్లు ఆసుపత్రికి వెళ్లి ప్రశాంత్ రెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా, గూడపాడు గ్రామానికి చెందిన బింగి అనిత కూడా ఇదే ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆమెను కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులిద్దరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన వైద్య చికిత్స అందించాలని నాగూర్ల వెంకటేశ్వర్లు ఆసుపత్రి వైద్యులను కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా కార్యదర్శి ఇర్సడ్ల సదానందం, మండల అధ్యక్షులు ఎండీ బాబు మియా, మండల ప్రధాన కార్యదర్శి దుంక దువ్వ రాజన్న, బింగి వేణు తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో 'మంగలి బండ తండా'కు సాగునీరు

- క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, నర్మెట్ట :** రైతాంగ క్షేమమే ధ్యేయంగా సాగునీటి కాల్వల పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. బుధవారం నర్మెట్ట మండలం హనుమంతపురం గ్రామ పరిధిలోని బొమ్మకూరు ఎడమ ప్రధాన కాలువ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. కాలువలో జరుగుతున్న పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు పనులను ఎమ్మెల్యే అధికారులతో కలిసి కాలినడకన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాలువ ప్రవాహ గతిని, దాని కింద ఉన్న ఆయకట్టు వివరాలను, ఏ ఏ గ్రామాలకు నీరు అందుతుందనే అంశాలను నీటి పారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా జాప్యం జరగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో రాజీ పడొద్దని సూచిస్తూ.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు వారం రోజుల గడువు విధించారు. వారం రోజుల్లో పూడికతీత పనులన్నీ పూర్తి చేసి, మంగలి బండ తండా వరకు సాగునీరు చేరేలా చూడాలి. చివరి ఆయకట్టు రైతుకు కూడా నీరు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ నరసింహ రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దొంగను పట్టుకున్న పోలీసులు



**వరంగల్ వాయిస్, దామెర:** మండల కేంద్రమైన దామెర గ్రామంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఆవుల సంపత్ అనే వ్యక్తి ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేశారు. దామెర గ్రామంలోని ఆవుల సంపత్ నివాసంలో కొద్దిరోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. నమ్మదగిన సమాచారం మేరకు, ఈ చోరీకి పాల్పడింది వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బెల్లి సందీప్ అని గుర్తించి, ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లకు పటిష్టమైన తాళాలు వేసుకోవాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఇమ్మానియేల్ రాజ్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** లింగాల ఘణపురం మండలంలోని సిరిపురం గ్రామ సర్పంచ్ చిటకోరు సంపత్ సోదరుడు చిటకోరు సుభాష్ – స్వస్తికల వివాహ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా తనయుడు, యువనాయకులు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళ్యాణ మండపానికి చేరుకున్న ఆయనకు సర్పంచ్ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన పుష్పగుచ్ఛంతో అభినందించి, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్ర నాయకులు దిలీప్ రెడ్డి, ఆర్జిబీఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షులు విజయ్ మనోహర్, జనగామ జిల్లా వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ నీలం మోహన్, మండల అధికార ప్రతినిధి భీమరాజు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సింగపురం నాగయ్య, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ జీడి కోర్నెల్, చిల్పూరు మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ చాగంటి మణి, తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలో రెండు వేర్వేరు వార్డులకు చెందిన ప్రముఖ వ్యక్తులు అనారోగ్యంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగురి విజయపాల్ రెడ్డి మృతుల నివాసాలకు వెళ్లి, వారి భౌతిక కాయాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన ఒంటేరు సమ్మయ్య అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందిన వెంటనే విజయపాల్ రెడ్డి, వార్డు అధ్యక్షుడు ఏకు రఘుపతి, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి సమ్మయ్య నివాసానికి వెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, స్థానిక 7వ వార్డుకు చెందిన దొమ్మటి ప్రసంగి నిన్న అనారోగ్యంతో కన్నుమూశారు. ఈరోజు వారి పార్థివ దేహాన్ని సందర్శించిన విజయపాల్ రెడ్డి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు దుంపేటి నాగరాజు, 18వ వార్డు అధ్యక్షులు ఏకు రఘుపతి, 7వ వార్డు అధ్యక్షులు ఉడుత సుమన్, ఉపాధ్యక్షులు గునిగంటి రవి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# 2028లో రాజ్యాధికారమే లక్ష్యం

## రేగొండలో టీఆర్పీ జోరు



**వరంగల్ వాయిస్, రేగొండ :** తెలంగాణ రాష్ట్రంలో రాబోయే కాలం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలదేనని, ఈ లక్ష్య సాధన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ శరవేగంగా అడుగులు వేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రవి పటేల్ స్పష్టం చేశారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో పార్టీ బలోపేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా, వారికి రవి పటేల్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతంలో భాగంగా రేగొండ మండల టీఆర్పీ మహిళా అధ్యక్షురాలిగా సాధు అనిత శ్రావణ్ ని రవి పటేల్ నియమించారు. మహిళలను రాజకీయంగా చైతన్యపరచడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తారని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న నేతృత్వంలో 2028లో రాజ్యాధికార పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తీన్మార్ మల్లన్నను బీసీ ముఖ్యమంత్రిగా చూడటమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గం నుంచి తొలి ఎమ్మెల్యే స్థానాన్ని సాధించడమే ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో గడపగడపకు ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శానిటేషన్ పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల పురపాలక సంఘం 13వ వార్డు నూతన కౌన్సిలర్‌గా ఎన్నికైన బొచ్చు మాధవి లత జాన్సన్ తన వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అప్పుడే కార్యాచరణ మొదలుపెట్టారు. వార్డు అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న ఆమె, బుధవారం వార్డులోని పలు కాలనీల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. కాలనీలలో నిల్వ ఉన్న చెత్త, డ్రైనేజీలలో పేరుకుపోయిన నీటిని గమనించిన కౌన్సిలర్, తక్షణమే స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పిలిపించారు. నిల్వ ఉన్న చెత్తను, నీటిని దగ్గరుండి శుభ్రం చేయించి ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో ముచ్చటించి వారి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాధవి లత జాన్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సహకారం, వార్డు ప్రజల ఆశీస్సులతో నేను కౌన్సిలర్‌గా ఎన్నికయ్యాను. వార్డు ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రథమ లక్ష్యం. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి వెన్నంటి ఉంటానన్నారు. అనంతరం పరకాల సీఐ క్రాంతి కుమార్ ని కౌన్సిలర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐకి శాలువా కప్పి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్‌కు సీఐ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొచ్చు విజేందర్, బొచ్చు భాస్కర్, మేకల దేవరాజ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను ఆదుకుంటాం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ ఉద్యమకారుల సంఘం పర్వతగిరి మండల అధ్యక్షుడిగా సోమారం గ్రామానికి చెందిన చల్లా వెంకన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చుతామని తెలిపారు. ఉద్యమకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, రోళ్లకల్ సర్పంచ్ దేవి మంగ్య నాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో రాజకీయం లేదు..

- అందరి సంక్షేమమే మా ధ్యేయం
- రూ.2.30 కోట్లతో పశ్చిమలో అభివృద్ధి పనులు
- రోడ్లు, డ్రైనేజీలకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన
- క్షేత్రస్థాయిలో సమస్యల పరిశీలన
- అధికారులకు కీలక ఆదేశాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** "ఎన్నికల వరకే రాజకీయాలు.. అభివృద్ధి విషయంలో మాత్రం పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగుతాం" అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని 52వ, 6వ డివిజన్లలో సుమారు రూ.2.30 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, వర్షపు నీటి పారుదల అభివృద్ధి పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే కాలనీల్లో కలియతిరిగారు. స్థానిక ప్రజలతో ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న డ్రైనేజీలను చూసి, వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. నైం నగర్ ప్రధాన నాలాకు అనుసంధానంగా ఉన్న కాలనీ నాలాలను పరిశీలించి, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ "ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వంటి కనీస అవసరాలు తీరినప్పుడే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు ఈ ప్రాంతంలో కోతుల బెడదను నివారించేందుకు గ్రిల్స్ ఏర్పాటుతో పాటు, వినూత్నంగా సోలార్ ఫెన్సింగ్ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నిర్ణయించారు. దీనివల్ల స్థానికులకు కోతుల నుండి ఉపశమనం లభించనుంది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చాడ స్వాతి, చెన్నం మధు, మాజీ డిప్యూటీ మేయర్ అశోక్ రావు, డివిజన్ అధ్యక్షులు తడుక సుమన్, నాయకులు బొమ్మతి విక్రమ్, సుగుణకర్ రెడ్డి, బాలు, దేవేందర్ రెడ్డి, లక్ష్మణ్, అశ్విన్, అధికారులు ఈఈ రవి కుమార్, డీఈ సారంగం, ఏఈ హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల బలోపేతానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** "ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతమే ధ్యేయంగా, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి స్పష్టం చేశారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. వచ్చే నెల మార్చి 13న కళాశాలలో నిర్వహించ తలపెట్టిన జాతీయ సెమినార్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ, బుధవారం పాలకుర్తి క్యాంప్ కార్యాలయంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. కళాశాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే పలు కీలక హామీలు ఇచ్చారు. విద్యార్థుల కోసం తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణానికి తక్షణ చర్యలు. కళాశాల ఆవరణలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం. త్వరలోనే స్వయంగా కళాశాలను సందర్శించి అదనపు అవసరాలను పరిశీలిస్తానని వెల్లడించారు. అనంతరం కళాశాల నూతన అడ్మిషన్ల కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యా రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బోలగాని రాములు, అధ్యాపకులు డాక్టర్ సుజాత, డాక్టర్ సునీల్, రాధిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేట్ల చేతుల్లోకి వ్యవసాయ రంగం

- మోదీ సర్కార్‌పై 'ఏఐకేఎంఎస్' ధ్వజం
- రైతుల విత్తన హక్కును కాలరాస్తున్న నూతన బిల్లులు
- నీరుగారుతున్న ఉపాధి హామీ చట్టం
- కోటేశ్వరరావు, మండల వెంకన్న ఆందోళన



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** దేశంలోని వ్యవసాయ రంగాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు, సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతోందని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.కోటేశ్వరరావు విమర్శించారు. బుధవారం నర్సంపేట పట్టణంలోని న్యూ డెమోక్రసీ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు జరిగాయి. సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నాయకులు నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన నూతన విత్తన చట్టం బిల్లు ఆమోదం పొందితే, రైతు తన సొంత విత్తనాన్ని ఉత్పత్తి చేసుకునే హక్కును కోల్పోతాడని హెచ్చరించారు. బహుళజాతి కంపెనీల విత్తనాలు, ఖరీదైన క్రిమిసంహారక మందుల వాడకం వల్ల పెట్టుబడి భారం పెరిగి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సవరణ బిల్లు ద్వారా మొత్తం రంగాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి నెడుతున్నారని ఆయన మండిపడ్డారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి, ఫోన్ల మాదిరిగా రీచార్జ్ చేసుకునే 'ప్రీపెయిడ్' విధానాన్ని తీసుకురావడం రైతాంగాన్ని దగా చేయడమేనన్నారు. కార్పొరేట్ కంపెనీలకు సబ్సిడీలు ఇస్తూ, రైతులకు ఇచ్చే రాయితీలను ఎత్తివేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న మాట్లాడుతూ.. 2005లో పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం 'జి. రాంజీ' అనే నూతన చట్టంతో నీరుగారుస్తోందని ధ్వజమెత్తారు. కూలీలకు చెల్లించే డబ్బులో 40% వాటా రాష్ట్రాలే భరించాలని చెప్పడం ద్వారా ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వెంటనే 'జి. రాంజీ' పథకాన్ని రద్దు చేసి, పాత ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ నాయకులు గట్టి కృష్ణ, బొమ్మెడ సాంబయ్య, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, సంఘం జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, భోగి సారంగపాణి, రమేష్, మల్లన్న, విజయ్, సాంబయ్య పాల్గొన్నారు.

# కులగణన జరిగే వరకు పోరు ఆగదు

- బీసీలను దగా చేస్తే సర్కారుకు పతనం తప్పదు
- బడ్జెట్‌లో రూ. 50 వేల కోట్లు కేటాయించాలి
- కామారెడ్డి 'బీసీ డిక్లరేషన్' ఎక్కడ?
- మార్చి 9న ధర్నాలకు వెంకట్రాములు పిలుపు




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** దేశ జనగణనలో కులగణనను అంతర్భాగం చేయాల్సిందేనని, బీసీల హక్కుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తే సహించేది లేదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని రాజబహదూర్ గౌర్ సమావేశ మందిరంలో నిర్వహించిన సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్, ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి, బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి దగా చేస్తోందని వెంకట్రాములు మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, కేవలం 17 శాతానికే పరిమితం చేయడం అన్యాయమన్నారు. అయినప్పటికీ బీసీలు జనరల్ స్థానాల్లో పోటీ చేసి పంచాయతీల్లో 52%, మున్సిపాలిటీల్లో 62% విజయం సాధించి తమ సత్తా చాటారని గుర్తు చేశారు. ఐదేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి, రెండేళ్లలో కేవలం రూ. 5 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. వచ్చే బడ్జెట్‌లో కనీసం రూ. 50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించేలా రాహుల్ గాంధీ, ఇండియా కూటమితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూదిపాళ ధనంజయ నాయుడు మాట్లాడుతూ.. నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో రజక కుటుంబంపై దాడి చేసి పసికందు మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మార్చి 9న రాష్ట్రవ్యాప్తంగా ఎంఆర్ఓ, ఆర్డీఓ, కలెక్టరేట్ల ఎదుట జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు దశరథ, కుమారస్వామి, యాదయ్య, విజయుడు, బాపిరాజు, కృష్ణ, కె.ప్రమీల, జె.లక్ష్మి, గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిలు గౌడ్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దీటి నరసయ్య, ప్రకాష్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం సోషల్ సైన్సెస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సు గురువారం ప్రారంభం కానుంది. ఈ మేరకు సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య బి.సురేష్ లాల్ ఒక ప్రకటనలో సదస్సు వివరాలను వెల్లడించారు. అచీవ్‌మెంట్స్ అండ్ పాత్‌వేస్" అనే అంశంపై ఈ జాతీయ సదస్సు ఫిబ్రవరి 26, 27 తేదీలలో విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో వైభవంగా జరగనుంది. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పాత్ర, సాధించిన విజయాలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సదస్సులో లోతైన చర్చ జరగనుంది. మొదటి రోజు జరిగే ప్రారంభ సమావేశానికి తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య వి.బాలకిష్టా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దక్షిణాఫ్రికాలోని డర్బన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఆచార్య రవీందర్ రేనా అంతర్జాతీయ దృక్పథంతో కూడిన కీలక ఉపన్యాసం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. ఈ సదస్సులో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మేధావులు, విద్యావేత్తలు తమ పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. విశ్వవిద్యాలయ బోధనా సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, సోషల్ సైన్సెస్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సదస్సుకు విస్తృతంగా హాజరుకావాలని డీన్ సురేష్ లాల్ కోరారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** పట్టణంలోని బీఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దొంగరి రేవతి శంకర్ కుమార్తె వివాహ వేడుక సందడి నెలకొంది. ఈ వేడుకకు పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హన్మకొండ ఝాన్సీ రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి, వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. వారి దాంపత్య జీవితం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దొంగరి రేవతి శంకర్ కుటుంబ సభ్యులను పలకరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమా రాజశేఖర్, సీనియర్ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు ముద్దసాని సురేష్, భద్రు నాయక్, నాయకులు బొమ్మనబోయన వెంకన్న, తాళ్లపల్లి రమేష్, జక్క మహబూబ్ రెడ్డి, రాంబాబు, మాచర్ల అరవింద్, గద్దల పరుశురాములు, యర్రం రాజు, పంజాల బుచ్చి రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'అప్పయ్యపల్లి'ని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

- సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్



**వరంగల్ వాయిస్, గణపురం:** గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, అప్పయ్యపల్లిని మండలంలోనే ఉత్తమ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని గ్రామ సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని అప్పయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ నిహారిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభ ప్రారంభంలో సర్పంచ్ వార్డు సభ్యులతో ముచ్చటించి, ఆయా వార్డుల్లో ఎదుర్కొంటున్న డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల సూచనల మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టేందుకు పలు కీలక అంశాలపై సభలో తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయం, అభివృద్ధి విషయంలో మాత్రం పార్టీలకు అతీతంగా అందరం ఒక్కతాటిపైకి రావాలని కోరారు. గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా పాలకవర్గం మొత్తం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి వార్డు సభ్యులు, అధికారులు మరియు మేధావులు ఇచ్చే మంచి సూచనలను ఎప్పుడూ స్వాగతిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కనిపర్తి వినయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి చంద్రగిరి రాకేష్, వార్డు సభ్యులు ఒంటేరు రమ్య, ఎలుక పెల్లి సంధ్య, కొప్పుల దేవేందర్, పిల్లి సప్న, బుర్రి నరేష్ పాల్గొన్నారు. వీరితో పాటు అంగన్‌వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, కారోబార్ రాజు తదితరులు పాల్గొని గ్రామసభను జయప్రదం చేశారు.

# ఏవీవీ విద్యార్థుల ప్రభంజనం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ స్థాయి ప్రతిభా ఉపకార వేతన పరీక్షల్లో (ఎన్ఎంఎంఎస్) హనుమకొండలోని ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎనిమిదవ తరగతికి చెందిన అశ్విత్, సహస్ర, లిఖిత లు ప్రతిష్టాత్మకమైన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో విజయం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారు. ఈ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం నుంచి నెలకు వెయ్యి రూపాయల చొప్పున, ఏడాదికి రూ.12,000లను నాలుగు సంవత్సరాల పాటు (మొత్తం రూ. 48,000) ఆర్థిక సహాయం పొందనున్నారు. విద్యార్థుల అద్భుత విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవీవీ విద్యా సంస్థల శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్ రెడ్డి, విద్యా సలహాదారులు వాసుదేవులు విజేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇదే పట్టుదలతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలలోని ఇతర విద్యార్థులు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకుని జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించాలని కోరారు. విద్యార్థుల గెలుపులో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయ బృందాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల సన్నద్ధత కోసం స్టడీ మెటీరియల్‌ను స్పాన్సర్ చేసిన సిరి చిట్ ఫండ్ అధినేత ఎల్లంకి రాజయ్య కి ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. ఉపాధ్యాయులు సంధ్యారాణి, నవీన్, భాగ్యలక్ష్మి, రమాదేవి, వీరేశలింగం, మహేంద్ర నాథ్, నరసింహారెడ్డి, శైలజ, అనూష, పీఈటీ రాజశేఖర్, శ్రీకాంత్, రాజేశ్వరి, విజేత, విద్యార్థులు పాల్గొన్నారు.

# రేపు కేయూలో ప్రిన్సిపాళ్ల కీలక సమావేశం

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాల పెంపుదల, ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా వర్సిటీ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా కేయూ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అకాడమిక్ కోఆర్డినేటర్లతో కీలక సమావేశం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం గురువారం మధ్యాహ్నం 3.00 గంటలకు విశ్వవిద్యాలయం హ్యూమానిటీస్ భవనంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ సెమినార్ హాల్‌లో జరగనుంది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కళాశాలల పనితీరుపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశంలో కళాశాలల అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. విద్యార్థుల్లో స్కిల్ డెవలప్మెంట్, ఎంప్లాయబిలిటీ (ఉపాధి) అవకాశాల పెంపు, రీసెర్చ్, ఇన్నోవేషన్, ఐపీఆర్ అంశాలకు ప్రాధాన్యత, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం, ఎంట్రప్రెన్యూర్షిప్ ప్రోత్సాహం, ఎన్ఏఏసీ గుర్తింపు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం సాధించడంపై చర్చ జరగనుంది. కేయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అకాడమిక్ కోఆర్డినేటర్లు ఎటువంటి మినహాయింపు లేకుండా ఈ సమావేశానికి విధిగా హాజరుకావాలని రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సమావేశం కళాశాలల భవిష్యత్ కార్యాచరణకు అత్యంత కీలకం కానుంది.

# గోరుగుట్ట తండాకు మినరల్ వాటర్ ప్లాంట్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని గోరుగుట్ట తండా సర్పంచ్ విజయలక్ష్మి భాస్కర్ నాయక్ గ్రామానికి శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ముందడుగు వేశారు. సమీప క్వారీ యాజమాన్యాన్ని సంప్రదించి గ్రామ ప్రజల నీటి సమస్యను వివరించచరు. స్పందించిన యాజమాని సొంత నిధులతో ఉచితంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అంగీకరించారు. ఈ నిర్ణయంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం కప్ పోటీల్లో కరీమాబాద్ విద్యార్థుల జోరు




**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** క్రీడల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమకు సాటిలేరని నిరూపిస్తున్నారు. వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ముందుగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో వీరు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలిచారు. తద్వారా రాష్ట్రస్థాయికి ఎంపికై, హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో వరంగల్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో రాయలి వైశాలి, వెలగందుల మహేశ్వరి, ఈగ వర్షిత మరియు కోట హనుక్ తమ క్రీడా నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని వచ్చిన విద్యార్థులను, వారికి తర్ఫీదునిచ్చిన గైడ్ టీచర్ పీ.ఈ.టీ అనిల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్ కుమార్, రమేష్, రాజమౌళి, శ్రీనివాసులు, పోగు అశోక్, శ్రీవాణి, తిలక్, శైలజ, కరుణకుమారి, అనూష, ప్రగత్ కుమార్, గౌస్, మురళీ కృష్ణ, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# దివ్యాంగులకు అవకాశం కల్పించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డిసబుల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రతాపరెడ్డిని, రిజిస్టార్ రామ చంద్రాన్ని యూనివర్సిటీలో కలిశారు. పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాలలో దివ్యాంగుల రోస్టర్ పాయింట్ల ఇంటర్ చేంజ్ విధానం అమలు చేయడం గూర్చి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసబుల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు మహమ్మద్ యాకుబ్ పాషా, రాంబాబు, శ్రీశైలం, సంతోష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిసబుల్ సెల్ డైరెక్ట్ డాక్టర్ అజ్మీర రాజు నాయక్ ను కలిశారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు అత్యంత ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయడంతో మొదటి రోజు పరీక్ష సజావుగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కవిత మాట్లాడుతూ ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో కస్తూరిబా ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, శాయంపేట ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. మొత్తం విద్యార్థులు 314 గాను, 306 హాజరైన కాగా, 08 గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా 11 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు. పరీక్షా కేంద్రం వద్ద చీఫ్ సూపరింటెండెంట్ నేతృత్వంలో సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ పకడ్బందీగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వెలుతురు వంటి కనీస వసతులను కళాశాల యాజమాన్యం కల్పించింది.

# బతుకమ్మ పండుగ లోపు కొత్త విగ్రహం ప్రతిష్టాపన చేస్తాం

- వరంగల్ వాయిస్ కథనానికి స్పందన

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ప్రజా సమస్యల పరిష్కారంలో 'వరంగల్ వాయిస్' పత్రిక మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. దౌలత్‌నగర్‌లో తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ తల్లి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటనపై పత్రికలో ప్రచురితమైన కథనానికి స్థానిక యంత్రాంగం తక్షణమే స్పందించింది. వార్త ప్రచురితమైన వెంటనే స్థానిక సర్పంచ్ ఘటన స్థలాన్ని పరిశీలించి తీవ్రంగా స్పందించారు. గ్రామ గౌరవానికి చిహ్నమైన బతుకమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఖండించారు. కేవలం విగ్రహం మాత్రమే కాకుండా, ప్రజల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వార్డు ప్రజలకు, ముఖ్యంగా గ్రామ మహిళలకు సర్పంచ్ ఒక కీలకమైన హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, వారి సహకారంతో రాబోయే బతుకమ్మ పండుగ నాటికి ధ్వంసమైన చోట అత్యంత సుందరమైన కొత్త విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని ప్రకటించారు. కేవలం విగ్రహమే కాకుండా, బతుకమ్మ ఘాట్ వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఆ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఘాట్ వద్ద భద్రతా చర్యలు బలోపేతం చేస్తామని, దోషులపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసు అధికారులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. తమ గ్రామ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి మార్గం చూపిన 'వరంగల్ వాయిస్' దినపత్రికకు దౌలత్‌నగర్ మహిళలు, గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పత్రిక సామాజిక బాధ్యతను గ్రామస్థులు ఈ సందర్భంగా కొనియాడారు.



దౌలత్‌నగర్‌లో బతుకమ్మ విగ్రహం ధ్వంసం

కఠిన చర్యలకు మహిళల డిమాండ్

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని దౌలత్ నగర్ గ్రామంలో చోటుచేసుకున్న విగ్రహ ధ్వంసం ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామ చెరువు కట్టపై భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన బతుకమ్మ తల్లి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. బతుకమ్మ ఘాట్ వద్ద ఉన్న తల్లి–బిడ్డల విగ్రహం చేతులను విరగ్గొట్టి పరారైనట్లు గ్రామస్తులు గుర్తించారు. స్థానికులు, గ్రామ మహిళల కథనం ప్రకారం.. గత కొంతకాలంగా బతుకమ్మ వేడుకలు జరిగే ఈ పవిత్ర ప్రదేశం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రాత్రి సమయాల్లో కొందరు వ్యక్తులు ఇక్కడ మద్యం సేవిస్తూ అనుచితంగా ప్రవర్తిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో లేదా కావాలనే విగ్రహాన్ని ధ్వంసం చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహం ధ్వంసం కావడంతో గ్రామ మహిళలు, యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తమ సెంటిమెంట్‌ను దెబ్బతీయడమేనని మండిపడ్డారు. "తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గం. వెంటనే దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలి." అని గ్రామ మహిళలు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ధ్వంసమైన విగ్రహాన్ని వెంటనే పునర్నిర్మించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా బతుకమ్మ ఘాట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

వరంగల్ వాయిస్ epaper.warangalvoice.net 24 Feb 2026 - Page 3

# సీటు బెల్టుతోనే ప్రాణ రక్షణ

## 'దామెర' పోలీసుల ప్రత్యేక తనిఖీలు




**వరంగల్ వాయిస్, దామెర :** పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు, వాహనదారుల్లో ట్రాఫిక్ నియమాలపై చైతన్యం నింపేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం దామెర పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దామెర క్రాస్ రోడ్డు వద్ద ఎస్.ఐ కొంక అశోక్ ఆధ్వర్యంలో సీటు బెల్టు నియమాల అమలుపై అవగాహన కల్పించారు. రహదారిపై వెళ్తున్న ఫోర్ వీలర్ వాహనాలను ఆపి, డ్రైవర్లు, ప్రయాణికులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని సూచించారు. సీటు బెల్టు ధరించడం వల్ల ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణాపాయం నుండి ఎలా తప్పించుకోవచ్చో వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ.. సీటు బెల్టు పెట్టుకోకపోవడం మోటార్ వాహనాల చట్టం ప్రకారం నేరమని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నదే పోలీసుల ఆకాంక్ష అని, అలైవ్ అలివ్–2026 కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దామెర పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# పోయిందనుకున్న బంగారం బీరువాలోనే..

## వృద్ధురాలికి అప్పగించిన పోలీసులు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఇంట్లో తలుపులు తెరిచి ఉండటంతో దొంగతనం జరిగిందని కంగారుపడ్డ ఒక వృద్ధురాలికి పోలీసులు ఊరటనిచ్చారు. పోయిందనుకున్న బంగారాన్ని అతి జాగ్రత్తగా వెతికి బాధితురాలికి అప్పగించి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామానికి చెందిన చీకటి కమలమ్మ అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రించింది. బుధవారం తెల్లవారుజామున లేచి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో ఆమె భయాందోళనకు గురైంది. వెంటనే బీరువాలో తనిఖీ చేయగా తాను దాచుకున్న బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని భావించిన ఆమె కుమారుడు రమేష్, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే నెక్కొండ సిఐ శ్రీనివాస్, చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇల్లంతా క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న సమయంలో, పోలీసులు బీరువాలోని దుస్తులను జాగ్రత్తగా పరిశీలించారు. ఈ క్రమంలో బీరువాలో ఉన్న చీరల మడతల్లోనే భద్రంగా ఉన్న బంగారు గొలుసులను పోలీసులు గుర్తించారు. ఆభరణాలు భద్రంగా ఉన్నాయని తెలియడంతో కమలమ్మ కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. బంగారాన్ని బాధితులకు అప్పగించి, పోలీసులు వారికి ధైర్యం చెప్పారు.

# 'డిగ్నిటీ అండ్ డ్రైవ్' జాతీయ సదస్సు

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన ప్రిన్సిపాల్ చంద్రమౌళి
- మహిళా భద్రత, సాధికారతపై మేధోమథనం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళల భద్రత, గౌరవం, అభివృద్ధిని కాంక్షిస్తూ హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) వేదికగా రెండు రోజుల జాతీయ సదస్సు జరగనుంది. కళాశాల స్థాపించి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా "డిగ్నిటీ అండ్ డ్రైవ్ – ఫ్యూయలింగ్ ఉమెన్స్ సేఫ్టీ అండ్ గ్రోత్ ఇన్ ఇండియా" అనే ఇతివృత్తంతో మార్చి 24, 25 తేదీలలో ఈ సదస్సును నిర్వహించనున్నారు. బుధవారం కళాశాలలో ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి ఆవిష్కరించారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ, మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సులో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. మహిళలు కేవలం స్వేచ్ఛగా తిరగడమే కాకుండా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం, ఆర్థిక స్వేచ్ఛను కలిగి ఉండటంపై అవగాహన. పనిచేసే చోట మహిళా ఉద్యోగుల రక్షణ, వారికున్న హక్కులు, చట్టపరమైన రక్షణ కవచాలపై చర్చ, మహిళల మానసిక, శారీరక ఆరోగ్యం, అన్ని రంగాలలో రాణించేలా నైపుణ్యాల అభివృద్ధిపై అవగాహన కల్పించడానికి ఈ




సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధి దేశాభివృద్ధికి మూలమని, ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సదస్సు విద్యార్థులకు, పరిశోధకులకు వినూత్న సమాచారాన్ని అందించే వేదికగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ డి.సురేష్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అరుణ, ఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.ప్రశాంతి, మహిళా సాధికారత కోఆర్డినేటర్ డాక్టర్ పి.అరుణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# విరోష్ ప్రీమియర్ లీగ్ సెలబ్రేషన్స్



ఫిబ్రవరి 26న గురువారం విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. తాజాగా ఈ తేదీని అధికారికంగా ప్రకటించారు. మంగళవారం మెహందీ, సంగీత్ సందడిగా జరిగినట్లు తెలుస్తోంది. సంగీత్‌లో విజయ్, రష్మిక కలిసి నటించిన సినిమాల్లోని ఫొటోలు, వీరి ప్రేమకథ ఫ్రేమ్‌లతో డెకరేషన్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలను అధికారికంగా షేర్ చేయాలని కోరుతూ అభిమానులు వీరిద్దరినీ ట్యాగ్ చేస్తున్నారు. సంగీత్‌లో భాగంగా ఇరు కుటుంబాలు సరదాగా 'విరోష్ ప్రీమియర్ లీగ'ను సెలబ్రేట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోను విజయ్ దేవరకొండ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. క్రికెట్ బ్యాట్, సిల్వర్ మెడల్‌పై ఫిబ్రవరి 26 అని రాసి ఉండడంతో పెళ్లి తేదీని ఇలా డిఫరెంట్‌గా ప్రకటించారని అభిమానులు సంబరపడుతున్నారు. ఈరోజు హల్దీ వేడుక జరగనుంది. ఉదయ్‌పూర్‌లోని మెమెంటోస్ హోటల్‌లో జరగనున్న వీరి పెళ్లికి ఇండస్ట్రీలోని ప్రముఖులతో పాటు వ్యాపారవేత్తలు కూడా హాజరుకానున్నారు.




### చదువులో ఇద్దరూ ఇద్దరే

విజయ్, రష్మికల డిగ్రీలపై సోషల్ మీడియా షేర్ ఈ నేపథ్యంలో వీరిద్దరి వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా విద్యాభ్యాసానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల్లోకి రాకముందు విజయ్, రష్మిక ఇద్దరూ తమ చదువును పూర్తి చేసి తర్వాతే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. హైదరాబాద్‌లోని భద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో కామర్స్ డిగ్రీ చేశారు. డిగ్రీ పూర్తయ్యాకే సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. ఇక బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ సైన్స్ అండ్ కామర్స్‌లో సైకాలజీ, జర్నలిజం, ఇంగ్లీష్ లిటరేచర్‌లో డిగ్రీ చేశారు. కాలేజీ రోజుల నుంచే మోడలింగ్ ప్రారంభించిన రష్మిక, తరువాత కన్నడ చిత్రం కిరిక్ పార్టీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా సక్సెస్‌తో దక్షిణాది ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ఇలా విజయ్ ? రష్మిక ఇద్దరూ డిగ్రీ పూర్తిచేసి తర్వాతే సినిమాల్లోకి వచ్చారు.

# దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి

☐ **తమన్నా భాటియా వెల్లడి**

నటీనటులు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు ఉన్నప్పుడే వేరే ఆదాయ మార్గాలు చూసుకోవాలని నటి తమన్నా అన్నారు. లేదంటే తర్వాత చాలా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమలోకి వచ్చిన తమన్నా 21 సంవత్సరాల నుంచి అగ్ర హీరోల సరసన నటిస్తూ మెప్పిస్తున్నారు. కొత్తగా నగల వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి నుంచి ఆర్థిక ప్రణాళికలు నేర్చుకున్నట్లు తెలిపారు. నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకున్నారు. నాకు ఎంతో మద్దతు ఇస్తూ.. మార్గనిర్దేశర చేశారు. ఇప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటూ రియల్ ఎస్టేట్, నగల వ్యాపారాలతో పాటు ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. అవే నాకు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. నేను ఇలా ఆలోచించడానికి నా తండ్రే కారణం. ఆయనే వల్లే ఈ క్రమశిక్షణ నేర్చుకున్నాను. అందరికీ ఈ విషయంలో దూరదృష్టి అవసరం. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉన్నవారు అవకాశాలు ఉన్నప్పుడే సరైన మార్గాల్లో డబ్బు ఆదా చేసుకోవాలి. దాన్ని పెంచుకునే దారులు కనిపెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు' అని తమన్నా అన్నారు. ఇక ఈ ఏడాది తమన్నా వరుస ప్రాజెక్ట్‌లతో సందడి చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.




# కొత్త తిరుపతిని చూస్తారు

☐ **దర్శకుడు అజయ్ భూపతి**

'ఆరఎక్స్ 100', 'మంగళవారం' వంటి వైవిధ్యభరితమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'శ్రీనివాస మంగాపురం' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే ఈ సినిమా గురించి ఆసక్తికరమైన అప్‌డేట్‌ను పంచుకున్నాడు దర్శకుడు అజయ్. ఈ సినిమా ద్వారా ప్రపంచానికి తెలిసిన ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతిలోని మరో కోణాన్ని, ఇప్పటివరకు ఎవరూ చూడని సరికొత్త పార్శ్వాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. మీరు ఇప్పటివరకు చూడని తిరుపతిని చూపిస్తాను.. సిద్ధంగా ఉండండి' అంటూ ఆయన చేసిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని టాలీవుడ్‌కు హీరోగా పరిచయం అవుతుండటం విశేషం. ఆయన సరసన ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్టును వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ మరియు సి.కె. పిక్చర్స్ వంటి దిగ్గజ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తిరుపతి నేపథ్యంలో అజయ్ భూపతి శైలిలో ఎంత 'రా' అండ్ 'రస్టిక'గా ఉండబోతుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.






# ఊపేస్తున్న నాని ఆయా షేర్ సాంగ్

ప్రస్తుతం సోషల్ మీయాలో నేచరల్ స్టార్ నాని 'ఆయాషేర' మేనియా ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ' నుంచి విడుదలైన ఈ స్పెషల్ సాంగ్ అటు టాలీవుడ్‌తో పాటు ఇటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌లో రికార్డులను తిరగరాస్తోంది. ఈ పాటలో నాని చూపించిన మాస్ ఎనర్జీ మరియు సిగ్నేచర్ స్టెప్పులు చూస్తుంటే, ఆయన గత పవర్‌ఫుల్ పాత్రల ప్రభావాన్ని కూడా ఇది మించిపోయిందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ' చిత్రం నుంచి 'ఔరా ఆఫ్ ఉస్తాద' పాట కూడా ఇటీవలే విడుదలైంది. మొదట్లో ఈ పాట ట్రెండింగ్‌లో నిలిచినప్పటికీ, నాని 'ఆయాషేర' వచ్చిన తర్వాత సీన్ పూర్తిగా మారిపోయింది. విడుదలైన కొన్ని గంటల్లోనే 'ఆయాషేర' పాట 'ఉస్తాద'ను వెనక్కి నెట్టి మ్యూజిక్ సెక్షన్‌లో టాప్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 'ఆయాషేర్ దెబ్బకి ఉస్తాద్ ఔరా గల్లంతయింది' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ అదిరిపోయే సాహిత్యం అందించారు. ఇప్పటికే ఈ పాటపై వేల సంఖ్యలో రీల్స్ వస్తుండగా, సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ నాని మాస్ స్టెప్పులను అనుకరిస్తూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది.

8

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, ఫిబ్రవరి 25, 2026

# బంజారాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- సంత్ సేవాలాల్ చూపిన మార్గాన్ని అనుసరించాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్రంలోని బంజారా కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అన్ని రంగాలలో బంజారా కులస్తులు అభివృద్ధి చెందాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ గుడి హరిత హోటల్ పక్కన తెలంగాణ ప్రభుత్వం సద్గురుసంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఆయన 287వ జయంతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్, గ్రంధాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ–భిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. బంజారా కులస్తులు భవన నిర్మాణం ఏర్పాటు చేసుకోవడానికి ప్రత్యేక స్థలాన్ని కేటాయించడం జరిగిందని వివరించారు. రానున్న రోజులలో ప్రభుత్వం వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. సమావేశానికి ముందు సీతక్క బంజారా భాషలో మాట్లాడి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చదువు వలననే ఏ జాతి అయినా బాగుపడుతుందని, చదువు, ఆరోగ్యం మీద శ్రద్ధ కనబరచాలని, అభివృద్ధి చెందిన వారు మిగతా వారి ఉన్నతికి పాటుపడాలని, మనం ఏం చేయాలన్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జిల్లాలో గిరిజన అధికారులు సామాజిక అభివృద్ధి అంశాలలో చొరవ తీసుకోవాలని, సంత్ సేవాలాల్ చూపిన ఆశయాలను అందరి సహకారంతో సాధించాలని, గిరిజన జాతి అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు బంజారాల కుల పెద్ద, ఉత్సవ కమిటీ అధ్యక్షులు పోరిక గోవింద్ నాయక్, పూజారులు రమేష్ గిరి మహారాజ్, కిషన్ మహారాజ్, ఐటీడీఏ అధికారి జనార్ధన్, రాహుల్, బంజారా కులస్తులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి..

జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అదేశించారు. అధికారులకు, ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా కార్యాలయ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., గ్రంధాలయ చైర్మన్ బానోతు రవి చందర్, ములుగు మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ–భిక్షపతితో కలసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అన్ని నిర్మాణ పనులను నాణ్యతతో అనుకున్న సమయానికి ముందుగానే పూర్తి చేయాలన్నారు. ఇందుకుగాను అధికారులు, గుత్తేదారు చొరువ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# చెత్త తరలింపుపై సీరియస్

- వాహనాలు సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్ కు చేరుకోవాలి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- బాలసముద్రంలోని ట్రాన్స్ఫర్ స్టేషన్ లో ఆకస్మిక తనిఖీలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చెత్త తరలింపు వాహనాలు నిర్దేశిత సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్ కు చేరుకోవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు సూచించారు. బుధవారం హనుమకొండలోని బాల సముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న ట్రాన్స్ఫర్ స్టేషన్ లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి వాహన మరమత్తుల తీరుతో పాటు తడి పొడి చెత్త సేకరణ విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. సమర్ధవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెహికల్ షెడ్ కు చేరే స్వచ్ఛ ఆటోలు వాహనాలు తడి, పొడి చెత్తను వేరుగా తీసుకొస్తున్నాయా? అని అడిగి తెలుసుకొన్నారు. ఎన్ని వాహనాలు మరమ్మత్తులు చేపట్టుటకు షెడ్ లో ఉన్నాయన్న కమిషనర్ కాంపాక్టర్ ల స్థితిగతులను ఈఈని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని ఆయా చెత్త సేకరణ వాహనాలు ఏ ప్రాంతాల్లో సేకరణ జరుపుతున్నాయని, ఏ సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్ కు చేరుతున్నాయని, చెత్త తరలింపు ట్రాక్టర్లు జేసీబీలతో పాటు వివిధ శానిటేషన్ వాహనాల కదలికల గురించి ఎంహెచ్ఓను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు మాధవీ లత, మహేందర్, డీఈ రాజ్ కుమార్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై స్పందించాలి

- ప్రజలకు అందుబాటులో ఉండాలి
- ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లకు నాయిని సూచన
- మర్యాద పూర్వంగా కమిషనర్ ను కలిసిన నేతలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు ఫ్లోర్ లీడర్లు తమకు బల్దియా కార్యాలయంలో కేటాయించిన ఛాంబర్ లలో ప్రజలకు అందుబాటులో ఉండాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు ఛాంబర్లో కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతినిధులుగా కార్పొరేటర్లు ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని, స్పందనలో జాప్యం అస్సలు ఉండకూడదని అన్నారు. గతంలో కాంగ్రెస్కు చెందిన నలుగురు కార్పొరేటర్లు ఉన్నప్పటికీ అభివృద్ధి పనులకు సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రస్తుతం అన్ని డివిజన్లకు, పార్టీ భేదం లేకుండా బీఆర్ఎస్, బీజేపీ డివిజన్లకు కూడా సమానంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని నాయిని తెలిపారు. అభివృద్ధిలో రాజకీయాలకు స్థానం లేదని, ప్రజలే ప్రాధాన్యం అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల అమలుపై కూడా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పశ్చిమ నియోజకవర్గం పూర్తిగా పట్టణ పరిధిలో ఉండటంతో చాలా మందికి ఇంటి స్థలాలు లేక ఎంపిక ప్రక్రియలో జాప్యం జరుగుతోందని వివరించారు. ఇంటి స్థలం ఉన్న అర్హులు తమ పత్రాలను వెంటనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఎవరూ డబ్బులు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే వారు ఎంతటి వారైనా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారికి ప్రోత్సాహక బహుమానం ఇవ్వడమే కాకుండా, డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కార్పొరేటర్లతో కలిసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలి, మామిండ్ల రాజు యాదవ్, దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, చీకటి ఆనంద్, మానస రాంప్రసాద్, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలపై ఉక్కుపాదం

- ప్రోత్సహిస్తే చర్యలు తప్పవు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- బాల్య వివాహాలపై అవగాహనకై ప్రచార రథం ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాల్యవివాహాలను చేసినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. బాల్యవివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ షేర్ ఎన్జీవో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వరంగల్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార రథాన్ని వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాల్యం అమూల్యమైన దశ అని పేర్కొన్నారు. బాల్యవివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక–మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. పిల్లలు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రవి, ఏహెచ్ టీయూ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, ఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ సమీయుద్దీన్,షేర్ స్వచ్ఛంద సంస్థ జిల్లాల కో–ఆర్డినేటర్ శిరీష, జ్యానేశ్వరి, జమున, ప్రశాంతి, కల్పన, గాయత్రి, చామంతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com